క్లుప్తంగా

దేవరగట్టులో అమావాస్య పూజలు

హొళగుంద: శ్రావణ మాసం అమావాస్యను పురస్కరించుకుని బుధవారం దేవరగట్టులో వెలసిన శ్రీ మాళమల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మెట్లకు బంధారు పెడుతూ కొండపైకి ఎక్కి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు మల్లయ్య, మహేష్ స్వామివారికి అభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. భక్తులకు ఉచిత అన్నదానం చేశారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు



శివన్న నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ముగతి పేటలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, 6వ వార్డులోని ఎస్సీ హాస్టల్ వద్ద గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించే సీసీ రోడ్డు, శివన్న నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్రైన్ పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రస్తుతం జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైన్ల పనులను గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు అమాన్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి

తుగ్గలి : మండల పరిధిలోని చెన్నంపల్లి, రామలింగాయపల్లి, రాంపల్లి, రామకొండ, పెండేకల్లు రైల్వే జంక్షన్ పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ రవి పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్తు సౌకర్యం, ర్యాంపులు పరిశీలించారు. అనంతరం ఓటరు సవరణ చేస్తున్న బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి మార్పులు, చేర్పులు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ వెంట మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వోలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వెల్దుర్తి: స్థానిక జాతీయ రహదారిపై పంజాబీ దాబా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డోన్‌కు చెందిన జంగాల రాజు తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు నుంచి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న హైవే పోలీసు మాధవరెడ్డి క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. యువకుడు మద్యం సేవించి బైక్ నడపినందునే అదుపుతప్పిందని స్థానికులు తెలిపారు.

శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలను పెంచుకోవాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ విక్టర్

ఆలూరు: శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలను పెంపకం రైతులకు లాభదాయకమని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రామచంద్రయ్య అన్నారు. బుధవారం ఎల్లార్తి రోడ్డులోని వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, గొర్రెల కాపరులతో గొర్రెలు, మేకలు, పాడి గేదెలు, కోళ్ల తదితర వాటి పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని ఆలూరు ఏడీఏ డాక్టర్ విక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్నే కాకుండా పంటల సాగు ఖర్చులకు పశుపోషణతో వచ్చే ఆదాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పశువైద్యాధికారులు డాక్టర్ విజయ్‌నాయక్, డాక్టర్ మల్లికా బాయ్, డాక్టర్ ప్రసన్నబాయ్ పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి

గోనెగండ్ల : తుగ్గలి మండలం ఎద్దుల దొడ్డి గ్రామానికి చెందిన దళిత మహిళపై సామూహిక అత్యాచారం చేసిన అదే గ్రామానికి చెందిన ఈడిగ ఉపేంద్ర, రామానాయుడులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్ల బస్టాండ్ ఆవరణలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డప్పు, చర్మ కారుల సంఘం నాయకులు మారేష్, నరసన్న, పెద్ద కొండయ్య, తేజ, రంగా, ఖాజా, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

అన్నింటికీ పంట నమోదే ఆధారం

- రైతులకు అండగా 'ఈ-క్రాప్'
- ఉచిత పంటల బీమా, సబ్సిడీ పథకాలకు పంట వివరాల నమోదు తప్పనిసరి
- ఆలూరు సబ్ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 37,718 వేల హెక్టార్లలో పంటల సాగు
- కొనసాగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ



పంటలకు ఈ -క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది.

ఆలూరు రూరల్: రైతులు సాగు చేసిన పంటలు విపత్తుల ద్వారా అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోతే వారికి ఆర్థికంగా అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ-క్రాప్ (పంట నమోదు)ను అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయాన్ని పండగ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విత్తనాల నుంచి ఎరువులు, పురుగు మందులు, పంట రుణాలు అందించడంతో పాటు విపత్తు సంభవించినప్పుడు నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు ఉచితంగా పంటల బీమాను అమలు చేస్తోంది. వీటన్నింటిని ఈ -క్రాప్ నమోదు ఆధారంగా అమలు చేస్తోంది. కాగా ఆర్బీకేల ద్వారా ఈ-క్రాప్ బుకింగ్ ప్రారంభమైంది. ఈ నెలాఖరు లోగా ప్రత్యేక యాప్‌లో వ్యవసాయ క్షేత్రస్థాయి సిబ్బంది ఈ -క్రాప్ నమోదు పూర్తి చేయాల్సి ఉంది.

37,718 హెక్టార్లలో పంటల సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో 37,718 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా పత్తి 23,274 హెక్టార్లు, 7,600 హెక్టార్లలో మిరప పంట సాగు కాగా..వేరుశనగ, కంది తదితర పంటలు సాగైనట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది సబ్ డివిజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 72,377 ఉండగా సకాలంలో వర్షాలు కురువకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం తగ్గింది. సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో ఇప్పటి వరకు 125 మంది రైతులకు సంబంధించి 2,110 ఎకరాల్లో పంట నమోదు చేయించుకున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు

ప్రతి రెవెన్యూ గ్రామంలో రైతులకు సంబంధించి పూర్తి వివరాలు ఈ- క్రాప్‌లో అధికారులు నమోదు చేస్తారు. పంట ప్రారంభంలో తాము సాగుచేసిన పంట, బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నంబర్, సర్వే నంబర్లు, తదితర వివరాలు ఈ-క్రాప్ యాప్‌లో పొందుపరుస్తారు. దీని వలన ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పంటల బీమా పథకం వర్తిస్తుంది. అలాగే ప్రభుత్వం అందించే వడ్డీలేని రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం అందించడంతో పాటు ఇతర సదుపాయాలకు సైతం ఈ క్రాప్ అవసరం. అందువలన గ్రామాల్లో రైతులు తప్పనిసరిగా ఆర్బీకేల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా పంట వివరాలు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయ సిబ్బంది ఈ-క్రాప్ వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రతి రైతుకు ఈ క్రాప్ తప్పని సరి



ప్రతి రైతు ఈ క్రాప్ తప్పని సరిగా చేయించుకోవాలి. ఈ విధానంలో ఆన్‌లైన్‌లో భూముల వివరాలు నమోదు చేయడం వలన రైతులు తాము సాగుచేస్తున్న భూముల్లో యాజమాన్య పద్ధతులపై ఎప్పటికప్పుడు సలహాలు పొందవచ్చు. ప్రభుత్వం అందించే రాయితీ పథకాలు పొందాలన్నా తప్పని సరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలి. దీని వలన కొత్తగా భూములు కొనుగోలు చేసుకున్న రైతులకు కూడా ప్రయోజనం ఉంటుంది. – సునీత, ఏడీఏ, ఆలూరు

పంటల ఆధారంగా పరిహారం..

ఈ క్రాప్ ముందుగా ఆయా సర్వే నంబర్ల వారీగా పంటలు నమోదు చేయడం వలన ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట ఆధారంగా పరిహారం చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. రైతుల తమ పొలాల్లో పత్తి, మిరప, ఉల్లి తదితర వాణిజ్య పంటలు పండిస్తే వాటికి ప్రత్యేకంగా నష్టపరిహారం అందిస్తారు. ఈ-క్రాప్ చేయడం వలన ఆయా పంటల వివరాలు నమోదు చేయబడి ఉంటాయి. ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానాల ప్రకారం ఈ-క్రాప్ వివరాలు ప్రతి ఏటా వ్యవసాయ అధికారులు నమోదు చేయాలి. దీని వలన ఆ ఏడాది కొత్త భూములు కొనుగోలు చేసిన రైతులకు ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

తుగ్గలి : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టే రీ సర్వేతో భూ సమస్యలు శాశ్వత పరిష్కారం లభించనుందని సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు అన్నారు. బుధవారం శభాష్ పురంలో రీ సర్వేను ఆయన ప్రారంభించారు. ఏళ్ల భూ సమస్యల పరిష్కారానికి, భవిష్యత్తులో భూ వివాదాలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందని, రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పావతి గౌరవ సలహాదారు రవి, వీఆర్వో రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శి కార్తీక్ రంగనాథ్, విలేజ్ సర్వేయర్ కృష్ణానాయక్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

భూ రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

హాలహర్వి : భూ రీ-సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ మల్లికార్జున, జెడ్పీటీసీ లింగప్ప సూచించారు. బుధవారం మండలంలోని నిట్రవట్టి సచివాలయంలో భూ రీ సర్వేపై వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. భూ రీ సర్వేలో ఎలాంటి తగాదాలు తావు లేకుండా ప్రతిఒక్కరికీ న్యాయం జరిగేలా సర్వే చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, సర్పంచ్ గాదిలింగప్ప, సర్వేయర్లు వెంకటేష్, అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సమగ్ర రీ సర్వే

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సమగ్ర భూ రీసర్వే శరవేగంగా సాగుతోందని తహసీల్దార్ నిత్యానందరాజు తెలిపారు. బుధవారం గ్రామంలోని రైతుల భూములను మండల సర్వేయర్ అబ్బుర్‌బాషా ఆధ్వర్యంలో గ్రామ సర్వేయర్లు ముమ్మరంగా రీ సర్వే చేశారు. సర్వేను తహసీల్దార్ పరిశీలించారు.

గడువులోగా ఓటరు సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలో ఓటరు సర్వే ఇచ్చిన గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీఎల్ఓలను, సూపర్‌వైజర్లను జెడ్పీ సీఈఓ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నాసరరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సూపర్ వైజర్లు, బీఎల్ఓలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ లోపు ఓటరు సర్వే పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఓటరు నమోదు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి, చనిపోయిన వారి పేర్లను జాబితాలో నుంచి తొలగింపు సక్రమంగా చేపట్టాలన్నారు. కొత్త ఓటరు నమోదు దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల తహసీల్దార్లు ఆంజినేయులు, వేణుగోపాల్, నిత్యానందరాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావు తదితరులు పాల్గొన్నారు.

70 శాతం ఓటరు సర్వే పూర్తి

కృష్ణగిరి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు సర్వే వేగవంతంగా చేపట్టామని, ఇప్పటివరకు పత్తికొండ నియోజకవర్గ వ్యాప్తంగా 70 శాతం పూర్తి చేశామని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ తెలిపారు. మండల పరిధిలోని ఎరుకలచెర్వు, చుంచుఎర్రగుడి గ్రామాల్లో బుధవారం ఆయన ఓటర్ సర్వేను, గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని, సచివాలయాలను తనిఖీచేశారు. తహసీల్దార్ రాజేశ్వరి, వీఆర్వోలు నాగరత్నమ్మ, మద్దిలేటి ఉన్నారు.

ఓటరు సవరణ తప్పులు లేకుండా చేయాలి

ఆలూరు రూరల్: ఓటరు జాబితా సవరణ తప్పులు లేకుండా చేయాలని ఆలూరు అసెంబ్లీ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ మల్లికార్జున అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఆరు మండలాల తహసీల్దార్లు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్ఓ సూపర్వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆలూరు ఏఈఆర్వో రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ సర్వే 60 శాతం పూర్తి

మద్దికెర : మండలంలో చేపట్టిన ఓటర్ సర్వే ఇప్పటి వరకు 60 శాతం పూర్తియినట్లు తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. బుధవారం ఆయన వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 21 వతేదీలోపు మొదటివిడత సర్వే పూర్తిచేయాలని సూచించారు.

ఓర్వలేకనే టీడీపీ దుష్ప్రచారం!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ లబ్ధి
- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం
- తెలుగు తమ్ముళ్లకు దిక్కుతోచక అసత్యారోపణలు
- ధ్వజమెత్తిన మంత్రి గుమ్మనూరు జయరాం



మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాన ప్రాధాన్యతినిస్తున్నారని, ఆ దిశగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని, ప్రజలు మేలు జరుగుతుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో తనను కలిసిన విలేకరులతో మంత్రి మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని, దీంతో అయోమయానికి గురైన టీడీపీ అధినేత కుట్ర రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. బాబుకుతోడు పవన్‌కళ్యాణ్ కూడా తాము ఉన్నామని నిరూపించుకునేందుకు శాంతిభద్రతకు విఘాతం కలిగించేలా ఉద్రేకపూరిత ప్రసంగాలు చేస్తూ రెచ్చగొడుతున్నారన్నారు. బాబుకు తగ్గట్టుగానే టీడీపీ నాయకులు సైతం అదేబాటలో పయనిస్తూ చిన్నపాటి విషయాలను పెద్దవిగా అల్లుతూ పచ్చమీడియాతో పిచ్చిరాతలు రాయిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అంటే ఓ కుటుంబం అని, చిన్నచిన్న సమస్యలు రావడం సహజమన్నారు. అయితే టీడీపీ నాయకులు ఏదో జరిగిపోయిందని, దుష్ప్రచారం చేస్తూ కుట్రలు పన్నుతున్నారన్నారు. తన హయాంలో ప్రజలతోపాటు పార్టీ శ్రేణులకు న్యాయం చేసేలా ముందుకు సాగుతున్నానని, పార్టీ నిర్ణయం, తన సహకారం మేరకు ప్రజాప్రతినిధులుగా కూడా ఎంపికయ్యారని గుర్తు చేశారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌వి పగటి కలలు...

టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని మంత్రి గుమ్మనూరు ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టేందుకే సెల్ఫీ అంటూ బాబు... బస్సు యాత్ర అంటూ పవన్ బుస్సు కొడుతున్నాడని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఏమి చేస్తామనే విషయాన్ని చెప్పకుండా... కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేందుకే అన్నట్టుగా ఉంది వారి వ్యవహారం అని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వనివి కూడా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని గుర్తు చేశారు. సీఎంతోపాటు, మంత్రులు, ఎమ్మెల్యేలను విమర్శించడమే లక్ష్యంగా బాబు, పవన్ ముందుకు సాగుతున్నారని, ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తే అధికారం వస్తుందా... అని ప్రశ్నించారు. వీరు రెచ్చగొట్టే ప్రసంగాలు ఎన్ని చేసినా, దండాలు పెట్టి గీకొట్టినా ప్రయోజనం శూన్యం అని, వీలైతే వాస్తవాలు మాట్లాడి ప్రజల అభిమానాన్ని పొందాలని సూచించారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

దేవనకొండ : రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగు, ప్రజలకు తాగు నీరు అందించాలని రాయలసీమ పరరక్షణ సమితి అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన దేవనకొండలో రాయలసీమ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమలో నీరు, నియామకం, నిధులు, రాయలసీమకు రావాల్సిన వాటా కోసం అందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

హంద్రీనీవాకు నీరు విడుదల చేయాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటిందని, సరైన వర్షాలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, హంద్రీనీవా ద్వారా సాగునీటిని విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తెర్నెకల్‌లో సీపీఎం కార్యాలయం వద్ద పార్టీ మండల కమిటీ సమావేశాన్ని సూరి అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు వీరశేఖర్, అశోక్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటర్ సర్వే

చిప్పగిరి: ఓటర్ల జాబితాలో తప్పు ఒప్పులు, మరణించిన వారిని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగింపు, కొత్త ఓటర్ల నమోదుకు నిర్వహిస్తున్న ఓటరు సర్వే మండలంలో ముమ్మరంగా సాగుతుంది. బుధవారం మండలంలోని నంచర్ల గ్రామంలో బీఎల్ఓ అష్రఫ్ బాషా గ్రామంలో పర్యటించి వివరాలు నమోదు చేసుకున్నారు. గ్రామంలో 42 మంది ఓటర్లు మరణించి నట్లు గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో బూత్ కమిటీ మెంబర్ శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



కై రుప్పలలో పూజలందుకున్న వీరభద్రస్వామి

ఆస్పరి/మద్దికెర/హాలహర్వి : మండల పరిధిలోని కై రుప్పలలోని వీరభద్రస్వామికి, తంగరడోణలోని చింతలముని, నల్లారెడ్డి స్వామి, ఆస్పరిలోని మారెమ్మవ్వ, ఈశ్వరస్వామి, రామతీర్థంలో వెలసిన గాయిత్రీ మాత ఆలయాల్లో బుధవారం అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే మద్దికెరలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో, మద్దమాంబ ఆలయంలో హాలహర్వి మండల పరిధిలోని గూళ్యం గ్రామంలో వెలిసిన గాదిలింగేశ్వరస్వామికి అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు.

సెప్టెంబర్ నెలాఖరుకు భవన నిర్మాణాలు పూర్తి



పోతుగల్లు సచివాలయం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీరాజ్ ఎస్పీ సుబ్రహ్మణ్యం

కృష్ణగిరి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని జిల్లా పంచాయత్‌రాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో నూతన సచివాలయ భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా సచివాలయాలు, ఆర్‌బీకేలు, జగనన్న హెల్త్ క్లినిక్‌లు నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈఈ మద్దన్న, పత్తికొండ డీఈ శేషయ్య, స్థానిక ఏఈ అబ్దుల్‌వహీద్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలు పిల్లల భవిష్యత్‌కు పునాది



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి

కృష్ణగిరి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నేర్చుకున్న నడవడికలపైనే పిల్లల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని జిల్లా ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి అన్నారు. మండల పరిధిలోని అమకతాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-3ని బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని ఆరా తీశారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్న పిల్లలకు అన్నప్రాశన కార్యక్రమాన్ని చేపట్టారు. సీడీపీఓ లూక, సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రావతి, ప్రేమలత, విజయలక్ష్మి ఉన్నారు.

జగనన్న నాయకత్వం ఏపీకి అవసరం

- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ రంగాల్లో చేపట్టిన ప్రగతిని వివరిస్తూ, ఏపీకి జగనన్న నాయకత్వం ఎందుకు అవసరం అనేది ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లపై ఉందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం పత్తికొండ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటివరకు ఎన్నో మార్పులు తీసుకువచ్చిన ఘనత సీఎం జగనన్నకు దక్కిందన్నారు. కరోనా క్లిష్టపరిస్థితులను అధిగమించి దేశంలో మన రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్న 5వ రాష్ట్రంగా ఎదిగిందని చెప్పారు.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి

ప్రభుత్వ విజయాలు ప్రజలకు అర్థం అయ్యేలా వివరించి, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు పత్తికొండ, మద్దికెర, కృష్ణగిరి మండలాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిందన్నారు. తుగ్గలి, వెల్దుర్తి మండలాల్లో త్వరలోనే పూర్తవుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మీడియా ప్రతినిధులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ పక్కీరప్ప, పత్తికొండ, కృష్ణగిరి ఎంపీపీలు నారాయణదాసు, వెంకట్రామిరెడ్డి, మద్దికెర జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే రోడ్డు గతంలో అధ్వానంగా ఉండేది. ఎమ్మెల్యే దృష్టికి విషయం తీసుకెళ్లగా, స్పందించి సీసీరోడ్డు వేయించారు. దీంతో ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి ఆధ్వర్యంలోని ఆధ్యాపక సిబ్బంది ఎమ్మెల్యేను, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, పత్తికొండ సర్పంచ్ కొమ్ముదీపికలను సత్కరించారు.

పనిచేసే ప్రభుత్వంపై ప్రజలకు భరోసా

హామీలన్నీ కచ్చితంగా నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో భరోసా ఉందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం పత్తికొండ పట్టణం గ్రామసచివాలయం-5 పరిధిలోని రామదాసు నగర్, హోసూరురోడ్డు కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి, ప్రభుత్వం నుంచి వారికి ఇప్పటివరకు అందిన సంక్షేమపథకాల బ్రోచర్లను అందజేశారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అన్ని కాలనీల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. శారదా వృద్ధాశ్రమానికి వెళ్లి వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, మాజీ వైస్ ఎంపీపీ పల్లెప్రతాప్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, జిల్లా కార్యదర్శి లలితా రామచంద్ర, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం ప్రార్థనలు



తుంగభద్రలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నందవరం : వరుణుడి కరుణ కోసం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని నదికై రవాడి గ్రామంలోని తుంగభద్ర నదిలో ముజఫర్ అబీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో ముస్లింలు వర్షాలు కురవాలని ప్రత్యేక నమాజు, దూవా చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు నజీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఆటో మహబుబ్, సల్లాం, రహీంబాషా, రఫిక్, మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్లార్తిలో గడపగడపకు మన ప్రభుత్వం

హొళగుంద: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం మండలంలోని ఎల్లార్తి గ్రామంలో నిర్వహిస్తున్న మండల కన్వీనర్ షఫీవుల్లా తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హాజరవుతారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు. ఉదయం 10 గంటల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకారవేతనాలు



విద్యార్థినికి ఉపకార వేతనం అందిస్తున్న బయోస్టాడ్ కంపెనీ ఆర్ఎం

ఎమ్మిగనూరుటౌన్: పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని ఎర్రకోట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ ఉపకారవేతనాలను అందజేశారు. బుధవారం పాఠశాలలో పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2500ల చొప్పున పాఠశాల హెచ్ఎం గౌసియాబేగంతో కలిసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కంపెనీకి వచ్చిన లాభాల్లో కొంతబాగాన్ని తమ రైతు కుటుంబాల అభివృద్ధికి వినియోగించాలనే తలంపుతో దేశంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ సీనియర్ ఏరియా సేల్స్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డీలర్ మహాలింగేశ్వరస్వామి, చిన్న స్వామి, ఫీల్డ్ ఆఫీసర్ రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.